# కట్నం కోరని కుర్రాడు

చిన్ని కథ



"వీరు చూస్తే రిటైరై పోయారు."

"అవును. పెన్షన్ డబ్బులు నూటయాభై వస్తున్నాయిగా."

"అమ్మాయి కాస్తో కూస్తో చదువుకున్నా, ఓ పదిరాళ్ళు సంపాదించి పెట్టుందేమో అంటే, దానికీ ఎక్కడైనా, ఏ చిన్న ఉద్యోగమైనా దొరికే అవకాశం కనిపించటం లేదు."

"అవును మరి....ఉత్తర దక్షిణాలు లేందే బంట్రోతు ఉద్యోగమైనా దొరకదు ఈ రోజుల్లో."

"మరి మాకువచ్చే నూటయాభై లో ముగ్గురం."

"ఇంతకీ ఏమంటావు? అమ్మాయికి పెళ్ళి సంబంధాలు వెతకమంటావు. అంతేనా?

"నేననటమేమిటి? మీకు మాత్రం తెలియనక్కర్లా? పిల్ల, పదోక్లాసు పాసు అవ్వగానే, పెళ్ళి సంబంధాలు చూడమంటే, 'అప్పుడేం తొందర, బాగానే చదువుతుందిగా....చదువుకోనీ, పెద్ద చదువులు చదువుకుంటే, ఉద్యోగం చేసుకుని దాని కాళ్ళమీద అది నిలబడుతుంది' అని డిగ్రీ దాకా చదివించారు. బాగానే వుంది. కానీ ఉద్యోగం దొరికిందా? వయసు చూస్తే పాతిక దగ్గర పడుతూంది. ఇవన్నీ మీకేం పట్టనట్లు కూర్చున్నారు మీరు."

"జానకీ! దేనికైనా టైమురావాలే. కళ్యాణ మొచ్చినా - కక్కొచ్చినా ఆగదన్న విషయం నీకు మాత్రం తెలీదా?"

"బాగానే వుంది మీ వరస. అలా అని మన ప్రయత్నం లేకుండా, కాళ్ళుముడుచుకూర్చుంటే 'మీ అమ్మాయిని చేసుకుంటాను', అని ఏ కుర్రాడూ కోరి ముందుకు రాడు. అంచేత...."

"ఊ....ఇంతకీ వెంటనే ఏదైనా పెళ్ళి సంబంధం చూసి, అమ్మాయికి కళ్యాణం జరిపించేయమంటావు అంతేనా...సరేలే, అలాగే చూస్తాను."

"మీరు ఇదిగో అంటే ఆర్నెల్లు చేస్తారు. ఈ పత్రిక కాస్త చూడండి. ఇందులో 'కట్నం అడగని అబ్బాయిలు' అని ఫొటోలతోసహా, వాళ్ళ అడ్రసులు ప్రచురించారు. వీళ్ళల్లో ఏ ఒక్కరైనా మన అమ్మాయికి ఈడుజోడుగా ఉంటారేమో ప్రయత్నించి చూస్తే...."

"ఏది ఇలాతే" అంటూ జానకి చేతిలోంచి పత్రిక అందుకుని, చూడసాగారు రామారావుగారు.

*

"వెళ్ళిన పనేమైంది?" అప్పుడే ఇంటికి వచ్చిన రామారావుగార్ని ప్రశ్నించింది జానకమ్మ.

"అబ్బాయిని చూసి, మాట్లాడాను. ఫొటోలో ఉన్నట్లే, అందంగా - ఆరోగ్యంగానే వున్నాడు కుర్రాడు. ఎం. ఏ. ఫస్టుక్లాసులో పాసైనాడట."

"కట్నం కానుకల విషయం?" రామారావు గారి మాటలకు మధ్యలో అడ్డొస్తూ అడిగింది జానకమ్మ.

"కట్నం కానుకలు తీసుకోడట. అబ్బాయికి కొన్ని ఆదర్శాలు వున్నాయట. పిల్ల చదువుకున్నదై, వినయవిధేయతలు కలిగి, మంచి సంప్రదాయక కుటుంబం నుంచి వస్తే చాలట."

"మరైతే ఇంకేం-అమ్మాయి ఫోటో చూపించారా అబ్బాయికి?"

"ఓ .... అమ్మాయి తనకు నచ్చిందని కూడా అన్నాడు కుర్రాడు."

"మరైతే, ఇంకేం....మన పద్మ పెళ్ళి ఇంతకాలానికి జరుగబోతున్నదన్నమాట. మీరన్నట్లు... కక్కొచ్చినా, కళ్యాణ మొచ్చినా ఆగవుసుమండీ! అసలు పెళ్ళిళ్ళు దేవుడు స్వర్గంలోనే చేసేస్తాడట. మన ఆదుర్దా కొద్దీ రకరకాలుగా తలపోస్తుంటాం తప్ప," జానకమ్మ లోలోపల ఎంతో సంతోషపడి పోతోంది.

"ఆగు .... ఆగు .... నీకు ఆనందం వచ్చినా, ఆవేశం వచ్చినా, పట్టటం కష్టం. అసలు విషయం పూర్తిగా విని అప్పుడు మాట్లాడు." అన్నారు రామారావుగారు జానకమ్మ సంతోషాన్ని మధ్యలోనే త్రుంచివేస్తూ.

"అబ్బాయికి చదువైతే వుంది కానీ, ఉద్యోగం లేదు."

"మీరెంత పిచ్చివారండీ! ఉద్యోగం ఇవ్వాళ కాకపోతే రేపు వస్తుంది. ఎం. ఏ. ఫస్టు క్లాసులో పాసైన కుర్రాడికి ఉద్యోగం రావడం కష్టం అటండీ? మీ ఆలోచనలన్నీ ఇలానే వుంటాయి." రామారావుగారు అమాయకులన్న ఉద్దేశ్యం జానకమ్మ మాటల్లో కొట్టొచ్చినట్లు కనపడింది.

"అదేమో కాని, అబ్బాయి 'బ్యాంక్ ఆఫీసర్' రిక్రూట్‌మెంట్ టెస్టులో పాసైనాడట. ఇంటర్వ్యూలో ఎలాగైనా, ఓ పదో, పదిహేనో వేలు ఖర్చుపెట్టి, ఆ ఉద్యోగం వచ్చేలా చూస్తే, మన అమ్మాయిని వాళ్ళ అబ్బాయికి కట్నం లేకుండా చేసుకోవటానికి, తనకేం అభ్యంతరం లేదని, పిల్లాడి తండ్రి ప్రక్కకు పిలిచి చెప్పాడు."

జానకమ్మ నోట మరో మాట రాలేదు!!

—పెనిశెట్టి లక్ష్మీశారద